సీఎం సహాయనిధికి రూ. 5 లక్షల విరాళం

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 20: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సర్వం కోల్పోయిన వరద బాధితుల కోసం తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సీఎం సహాయనిధికి రూ. 5 లక్షల విరాళం ప్రకటించింది. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో సంఘం ప్రతినిధులు కలిసి రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీటీపీఏ అధ్యక్షుడు కె.నర్సింగరావు, కార్యదర్శి పి.గోపాల్, కోశాధికారి కె.హుస్సేన్, సభ్యుడు ఎం.దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సభ

ఖైరతాబాద్, సెప్టెంబర్ 20 : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సభను శనివారం జలదృశ్యంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సభ వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. వర్ధంతి సభకు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, హాజరవుతారని పేర్కొన్నారు.

డిగ్రీ కోర్సుల ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 20: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ, బీఎస్సీ, బీకామ్ కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ పరీక్షలను ఈనెల 27 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నిధులు మంజూరైనా.. అభివృద్ధి జాడేదీ?

- సమస్యలకు నిలయంగా 'బంజారాహిల్స్' డివిజన్
- జీహెచ్‌ఎంసీ మేయర్ ఇక్కడి వారైనా పట్టించుకోవడం లేదంటూ సర్వత్రా ఆరోపణలు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 20 : పేద, మధ్య తరగతి, ధనిక... ఇలా అన్ని వర్గాల ప్రజలు నివసించే బంజారాహిల్స్ డివిజన్ సమస్యలకు నిలయంగా మారింది. జీహెచ్‌ఎంసీ మేయర్ ఇక్కడి వారైనా డివిజన్‌ను పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని 150 డివిజన్లలో బంజారాహిల్స్ అభివృద్ధిలో అధమ స్థానంలో ఉందని పేర్కొంటున్నారు.

గత ఐదు సంవత్సరాలుగా డివిజన్ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరైనప్పటికీ వాటిని ఖర్చు చేసిన దాఖలాలు లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ నిధులు ఎటుపోయాయని, మేయర్ సమాధానం చెప్పాలని డివిజన్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అరకొరగా చేపట్టిన పనులు సైతం నాణ్యత లోపించి నిరుపయోగంగా మారాయని గుసగుసలాడుతు న్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో డివిజన్..

ఎన్‌బీటీ నగర్‌లో 2022లో రూ.5.95 కోట్లతో చేపట్టిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్‌బీటీ నగర్ కమాన్ నుంచి ఏసీబీ కార్యాలయం వరకు రోడ్డు నిర్మాణ పనులకు రూ.1.9 కోట్లు మంజూరైనా ఇంతవరకు చేపట్టలేదు. మేయర్ ఇంటి వెనుక ఇంటర్నల్ రోడ్లు లేక వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగి, వరదనీరు నిలిచి, బురదమయంగా మారుతుందని ఆ బస్తీవాసులు ఆరోపిస్తున్నారు.

మేయర్ ఇంటి వెనుక బస్తీలో అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు

పోచమ్మ దేవాలయం వద్ద గత ఆర్నేళ్లుగా వీధి దీపాలు వెలగడం లేదు. ఫలితంగా రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. శ్రీరాం నగర్‌కాలనీలో దేవాలయం పక్కనే ఉన్న నాలా స్లాబ్ శిథిలావస్థకు చేరుకున్నది. ఎన్‌బీనగర్‌లో ప్రతిపాదిత సీసీ రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. సింగాడకుంటలో నాలా వద్ద రిటైనింగ్ వాల్ లేక వర్షాకాలంలో మురుగు ఏరులై పారుతున్నది. ఉదయ్‌నగర్‌లో నాలా సైడ్ వాల్స్ దెబ్బతిన్నా పట్టించుకున్న నాథుడే లేడు. ప్రేమ్‌నగర్ వీడీసీసీ నిర్మాణానికి నోచుకోలేదు. ఆనంద్‌నగర్‌కాలనీలో సరైన రోడ్లు లేవు. ఎమ్మార్వో కార్యాలయం వెనుకవైపు ఉన్న తాళ్లబస్తీలో పార్కు నిరుపయోగంగా ఉన్నది. బోళానగర్‌లో ధోబీఘాట్ గల్లీలో జలమండలి, జీహెచ్‌ఎంసీ మధ్య సమన్వయం లేక డ్రైనేజీ పనులు ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. పారిశుధ్యం లోపించడంతో పాటు గత కొన్ని నెలలుగా స్ట్రీట్ లైట్స్ వెలగడం లేదని బస్తీవాసులు వాపోతున్నారు. అంబేద్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, మేయర్ పట్టించుకోకపోవడంతో దీనికి సంబంధించిన 300 గజాల స్థలం కబ్జాకు గురైందని పలువురు పేర్కొంటున్నారు. స్వమస్యలపై మేయర్‌ను ఎన్ని సార్లు కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదని డివిజన్ ప్రజలు ఆరోపిస్తున్నారు.

రూ.1.9 కోట్ల నిధులు మంజూరైనా నిర్మాణానికి నోచుకోని ఎన్‌బీటీనగర్ రోడ్డు

మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి

- టీఎల్‌ఎఫ్ సమావేశంలో యూసీడీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి

యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కులో మహిళలకు ఉపాధి పథకాలపై అవగాహన కల్పిస్తున్న యూసీడీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి

జూబ్లీహిల్స్,సెప్టెంబర్ 20 : పొదుపు సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యూసీడీ అడిషనల్ కమిషనర్ సీ. చంద్రకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కులో టౌన్ లెవల్ ఫెడరేషన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో అందిస్తున్న వివిధ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో మహిళలు విభిన్నరకాల వ్యాపారాలు నిర్వహించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సమావేశంలో యూసీడీ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట కిషన్‌రావు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఎం.ప్రశాంత్, వెంకటయ్య, ఎం.శ్రీనివాస రావు, 24 స్లమ్ లెవల్ ఫెడరేషన్ అధ్యక్షులు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

షెల్టర్లలో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలి

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని యూసీడీ అడిషనల్ కమిషనర్ సి.చంద్రకాంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని నైట్ షెల్టర్‌ను ఆయన సందర్శించి కేంద్రంలో అందిస్తున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా, యూసీడీ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు పాల్గొన్నారు.

తెరిచిన పుస్తకం.. అక్కినేని జీవితం

- ప్రముఖ సినీ నటుడు సుమన్

అక్కినేని ఆత్మీయ పురస్కారంతో డీపీ మిత్ర, సుభాష్‌ను సత్కరిస్తున్న సినీనటుడు సుమన్

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 20: మహానటుడు అక్కినేని జీవితం తెరిచిన పుస్తకం లాంటిదని ప్రముఖ సినీనటుడు సుమన్ తల్వార్, తిరుమల బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ అన్నారు. పద్మ విభూషణ్, నట సమ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి మహోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి హిమాయత్‌నగర్‌లోని అలైడ్ ఆర్టిస్ట్స్ ఆడిటోరియంలో అక్కినేని సంగీత మహోత్సవం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినిమా కీర్తిని ఆకాశానికి చేర్చిన గొప్ప వ్యక్తి అక్కినేని అని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమన్నారు. అనంతరం ప్రముఖ గాయకులు డీపీ మిత్ర, పి.సుభాష్‌కు డాక్టర్ అక్కినేని ఆత్మీయ పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఆమని బృందంచే అక్కినేని సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ ప్రభాకర్‌రావు,కార్యదర్శి మద్దాళి రఘురామ్, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ సుబ్బారావు,ఎఎఎ స్టూడియో ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, ప్రతినిధులు కామేశ్వరరావు, రజనీ పాల్గొన్నారు.

స్వచ్ఛ నార్సింగి వాల్ ఆఫ్ కైండ్‌నెస్‌కు స్పందన

నార్సింగిలోని స్వచ్ఛ నార్సింగి వాల్ ఆఫ్ కైండ్‌నెస్‌ను సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్

మణికొండ, సెప్టెంబర్ 20: ప్రజల కోసం ఏర్పాటు చేసిన స్వచ్ఛ నార్సింగి వాల్ ఆఫ్ కైండ్‌నెస్‌కు విశేష స్పందన లభిస్తున్నదని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. ఇందులో ప్రజలకు అవసరం లేని వాటిని తీసుకువచ్చి భద్రపరుస్తున్నారని పేర్కొన్నారు. వీటి అవసరం ఉన్న వారు ఇక్కడకు వచ్చి తీసుకుంటారని తెలిపారు. చిన్న, పెద్ద వస్తువులు ఇందులో భద్రపరుస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం నార్సింగి ప్రాంతంలోని నిరుపేదలు రామలక్ష్మి, యాదమ్మ, సుగుణమ్మ తదితరులకు చీరలు, దుప్పట్లు అందజేశామన్నారు. నిరుపయోగంగా ఉన్న సామాన్లు, దుప్పట్లు, ఇతర వస్తువులను ప్రజలు ఈ సెంటర్‌కు తీసుకురావాలని సూచించారు. అవసరం ఉన్న వారికి వాటిని అందిస్తారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ అరుణ్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రదీప్, సూపర్‌వైజర్లు జనార్ద న్‌రెడ్డి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జలవిహార్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగేంధర్ గౌడ్

జలవిహార్ వద్ద నిరసన తెలుపుతున్న యుగేంధర్ గౌడ్ తదితరులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 20 : సాగర్‌ను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టిన జలవిహార్ నిర్వాహకులపై హైడ్రా చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన జలవిహార్‌ను సందర్శించి అక్కడ అక్రమ కట్టడాలను పరిశీలించి నిరసన తెలిపారు. హుస్సేన్‌సాగర్ పరీవాహక ప్రాంతాల్లో శాశ్వత నిర్మాణాలు చేపట్టవద్దని ప్రభుత్వ నిబంధనలు ఉన్నా జలవిహార్ నిర్వాహకులు మాత్రం అతిక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. దాంతో నిర్వాహకులు కోట్లాది రూపాయల పన్నులను ప్రభుత్వానికి ఎగ్గొటారని ఆయన ఆరోపించారు. జలవిహార్ అక్రమ కట్టడాల వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని, ఈ విషయమై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట సురేందర్‌గౌడ్, నగేశ్, మల్లేశ్, హరేందర్, వీరేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, తదితరులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 20 : పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తెలిపారు. శుక్రవారం శంషాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తాసీల్దార్ రవీందర్ దత్తు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్ మండ లం, మున్సిపాలిటీ పరిధిలోని 103 మంది లబ్ధిదారులకు కోటి మూడు లక్షల 11వేల రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేశామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ తన్విరాజు, కౌన్సిలర్లు మేకల వెంకటేశ్, భాగ్యలక్ష్మి, లావణ్యగౌడ్, సంజయ్‌యాదవ్, అజయ్, ఆయిల్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు దండు ఇస్తారి, సతీశ్‌యాదవ్, ఆర్ఐ సారిక, నాయకులు చంద్రారెడ్డి, రాజుముదిరాజ్‌తోపాటు పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు ప్రతిపాదనలు పంపండి..

ఈఈ విజయ్‌కుమార్‌తో రోడ్ల నిర్మాణంపై చర్చిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

జూబ్లీహిల్స్,సెప్టెంబర్ 20 : జూబ్లీహిల్స్ డివిజన్‌లో రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. శుక్రవారం ఫిలింనగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఈఈ విజయ్‌కుమార్‌తో సమావేశమై రోడ్ల నిర్మాణంపై చర్చించారు. ఫిలింనగర్‌లోని వినాయక్‌నగర్, పటేల్‌నగర్, భగత్ సింగ్ కాలనీ, జ్ఞాని జైల్‌సింగ్‌నగర్, మాగంటి కాలనీ, రోడ్ నంబర్ 9లోని అంబేద్కర్‌నగర్, బాలిరెడ్డినగర్‌తో పాటు ఇంద్రనగర్‌లోని స్ట్రీట్ నంబర్-2, 3లో నూతన రోడ్ల నిర్మాణానికి ఎస్టిమేషన్స్ సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. నూతన రోడ్ల నిర్మాణం, పెండింగ్ రోడ్ల పనులను వేగవంతం చేసేందుకు త్వరలోనే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలువనున్నట్లు ఆయన వెల్లడించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఎల్ఎన్ నగర్‌లో వీడీసీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్

జూబ్లీహిల్స్,సెప్టెంబర్ 20 : అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని యూసుఫ్‌గూడ డివిజన్ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం లక్ష్మీనరసింహనగర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులు చేపడుతున్న వీడీసీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఒకవైపు పాఠశాలలు, మరోవైపు పండుగల సందడి ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్ రాంచంద్రారెడ్డిని ఆదేశించారు. ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఆధ్వర్యంలో కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఐలపాక నర్సింగ్ దాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఏఈ వెంకటేశ్, బస్తీవాసులు అక్రమ్, సాజిద్ బాయ్, వసీమ్, చందు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 22న 'చిత్రామృతం'

ఖైరతాబాద్, సెప్టెంబర్ 20: ఎన్‌చాంట్ మీడియా, ఎం3 ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తాధ్వర్యంలో డిసెంబర్ 22న 'చిత్రామృతం' పేరుతో ప్రముఖ గాయని కేఎస్ చిత్ర లైవ్ కచేరి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంస్థ కార్యాలయం వద్ద గాయని సునీత చేతుల మీదుగా కచేరికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నిమజ్జన ఊరేగింపులో ఘర్షణ.. 12 మందిపై కేసు

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 20: వినాయక నిమజ్జన ఊరేగింపు సందర్భంగా మంగళవారం రాత్రి బోరబండ బస్ టెర్మినల్ చౌరస్తాలో నిర్వాహకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనను సుమోటాగా తీసుకున్న పోలీసులు 12 మందిపై కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోరబండ ఠాణా పరిధిలోని బస్ టెర్మినల్ చౌరస్తా వద్ద మంగళవారం అర్ధరాత్రి వరకు వినాయక విగ్రహాల ఊరేగింపు కొనసాగింది. ఊరేగింపులో వీకర్‌సెక్షన్‌లోని అంబేద్కర్‌నగర్, బంజారానగర్‌కు చెందిన గణేశ్ విగ్రహాలు ఉన్నాయి. చిన్న విషయంపై అంబేద్కర్‌నగర్, బంజారానగర్ ఉత్సవ నిర్వాహకుల మధ్య ఘర్షణ జరిగింది. కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. అక్కడే ఉన్న పోలీసులు ఎంత చెప్పినా గొడవ సద్దుమణగలేదు. దీంతో సుమోటోగా తీసుకున్న పోలీసులు 12 మందిపై కేసు నమోదు చేసి శుక్రవారం వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 20: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మిగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు లక్ష్మిగూడ గ్రామం, హౌజింగ్‌బోర్డు కాలనీ, ఆర్‌జీకే, వాంబేకాలనీ, బృందావన్ కాలనీ, గణేశ్‌నగర్ తదితర ప్రాంతాల్లో మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరా విధిస్తున్నట్లు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- దాతలు ముందుకొస్తే విద్యార్థులకు స్నాక్స్ : డిప్యూటీ డీఈఓ

ఫిలింనగర్ రౌండ్ టేబుల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన పదో తరగతి విద్యార్థులు

జూబ్లీహిల్స్,సెప్టెంబర్ 20 : ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. ఎస్ఎస్‌సీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌కు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మార్చి 2025లో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతిరోజూ అదనంగా ఒక గంటపాటు పునశ్చరణ తరగతులు చేపడుతున్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్పెషల్ రివిజన్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఫార్మేటివ్-1,-2 పరీక్షలు పూర్తిచేసి అక్టోబర్‌లో నిర్వహించనున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా దసరా సెలవుల లోపే విద్యార్థులను ఎస్ఏ-1 కు సిద్ధం చేసి పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. కాగా కొన్ని పాఠశాలల్లో ఇప్పటికే ప్రత్యేక తరగతులతో పది విద్యార్థులకు బోధిస్తుండగా గత సోమవారం నుంచి విద్యార్థులకు ప్రతిరోజూ సాయంత్రం అదనంగా ఒక గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

గంట పాటు ప్రత్యేక తరగతులు..

పదో తరగతి విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభించాము. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలతో ప్రతిరోజు సాయంత్రం గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాము. విద్యార్థులు పూర్తిస్థాయి సామర్థ్యం పెంచుకునేలా బోధిస్తున్నాము. ఖైరతాబాద్ జోన్ పరిధిలో 17 ఉన్నత పాఠశాలలున్నాయి. దాతలు ముందుకువస్తే ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తాము.

- డిప్యూటీ డీఈఓ శ్యామ్యూల్‌రాజ్, ఖైరతాబాద్ జోన్

ఎంబీఏ ఈవినింగ్ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ ఈవినింగ్ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్-ఈవినింగ్) కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫీజును ఈనెల 26లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతమే లక్ష్యం

- బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అప్పారెడ్డి ముఖేశ్



మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 20: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బీఆర్‌ఎస్‌వీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అప్పారెడ్డి ముఖేశ్ అన్నారు. శుక్రవారం అత్తాపూర్ డివిజన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖేశ్ మాట్లాడారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో బీఆర్‌ఎస్ బలమైన శక్తిగా ఉందన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపే తం చేసేందుకు కార్యకర్తలతో కలిసి పర్యటనలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే అత్తాపూర్ డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని, వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి కార్తిక్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులు, నిరుపేదల పక్షాన పోరాడుతామన్నారు. ఉద్యమ రథసారథి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ నేతృత్వంలో స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీ సంఖ్యలో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునిక దంత వైద్యంలో సరికొత్త అధ్యాయం

- ఎఫ్‌ఎంఎస్ డెంటల్ హాస్పిటల్‌లో న్యూరోమస్క్యులర్ డెంటిస్ట్రీ సేవలు ప్రారంభం



వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌ఎంఎస్ డెంటల్ హాస్పిటల్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, ఎండోడెంటిస్ట్ డాక్టర్ రమేశ్‌బాబు, టీఎంజే స్పెషలిస్ట్ డాక్టర్ ఫైజల్ జర్ది

జూబ్లీహిల్స్,సెప్టెంబర్ 20 : ఆధునిక దంత వైద్యంలో సంప్రదాయ సమస్యలతో పాటు టెంపోరో మ్యాండిబులర్ జాయింట్(టీఎంజే) రుగ్మతలను న్యూరోమస్క్యులర్ డెంటిస్ట్రీ సేవలతో పరిష్కరిస్తూ సరికొత్త అధ్యాయాన్ని లిఖించనున్నట్లు ఎఫ్‌ఎంఎస్ డెంటల్ హాస్పిటల్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ పార్థసారథిరెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఎఫ్‌ఎంఎస్ డెంటల్ దవాఖానలో న్యూరోమస్క్యులర్ డెంటిస్ట్రీ స్పెషాలిటీ సేవలను క్వాలిటీ కంట్రోల్ డైరెక్టర్, ఎండోడెంటిస్ట్ డాక్టర్ రమేశ్‌బాబు, సీనియర్ టీఎంజె స్పెషలిస్ట్.. హెచ్‌ఓడీ డాక్టర్ ఫైజల్ జర్దితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. దంత వైద్యంలో సైడ్ ఎఫెక్ట్స్‌కు చెక్ పెట్టేందుకు అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో నాడీ కండరాల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఎఫ్‌ఎంఎస్ అంతర్గత దంత సమస్యలపై అధ్యయనం చేస్తూ అనుభవజ్ఞులైన వైద్య బృందంతో అత్యంత భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఒరో ఫేషియల్ చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

రూ. 3.20లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ

పెద్దతూప్ర గ్రామంలో 3.20లక్షలకు లడ్డూ దక్కించుకున్న మాజీ ఎంపీటీసీ దిద్యాల యాదగిరి

శంషాబాద్ రూరల్, సెప్టెంబర్ 20 : మండలంలోని పెద్దతూప్ర గ్రామంలో వినాయక నిమజ్జనం వైభవంగా జరిగింది. అంతకుముందు గ్రామంలోని దిద్యాల కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూకు వేలం నిర్వహించగా మాజీ ఎంపీటీసీ దిద్యాల యాదగిరి రూ. 3.20 లక్షలకు దక్కించుకున్నారు. అదేవిధంగా మండలంలోని నానాజీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను వేలంలో పిట్టల రవిగౌడ్ దక్కించుకున్నారు. మల్కారం శివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను ఎం రంజిత్ రూ. 55వేలకు దక్కించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రోడ్లపై గుంతలతో వాహనదారుల అవస్థలు



మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 20: గుంతలమయంగా మారిన రోడ్లపై వాహనాదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, కాటేదాన్, దుర్గానగర్, లక్ష్మిగూడ, చైతన్య విల్లాస్ కాలనీ, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, జనప్రియ, అంబియన్స్‌ఫోర్ట్, లక్ష్మీనగర్, పాండురంగానగర్, రాంబాగ్ తదితర ప్రాంతాల్లో రోడ్లు నడిచేందుకు సైతం వీలులేకుండా మారిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయి కంకర తేలి ప్రమాదభరితంగా మారాయి. రోడ్లు గోతులమయం కావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా పూర్తిగా శిథిలావస్థకు చేరిన ప్రాంతాల్లో నూతన రోడ్లు నిర్మించాలని వేడుకుంటున్నారు.